Janampower.in
TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
JANAM POWER
కరీంనగర్ Karimnagar | శుక్రవారం Friday | 23.01.2026 | సంపుటి : 14 Valume : 14 | సంచిక : 235 Issue : 235 | పేజీలు : 10 వెల: 5/- Pages : 10 Cost: 5/-



Editor: BANDARI MARUTHI

## ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ
# డేటా సెంటర్



### యూపీసీ వోల్ట్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం
రూ.5 వేల కోట్ల పెట్టుబడులు ■ సుమారు 4వేల మందికి ఉపాధి

**హైదరాబాద్, జనవరి 22:** దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని ఆకర్షించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్

మిగతా 2 లో

### వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ
'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలపై విస్తృత చర్చ



## ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో
# తెలంగాణ రికార్డు

- 25 ఏళ్లలో ఇదే అత్యధిక స్థాయి ■ దేశ చరిత్రలో ఆల్‌టైమ్ హై
- 14.20 లక్షల రైతులకు రూ.18,532.98 కోట్ల చెల్లింపు
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, జనవరి 22:** తెలంగాణ రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా, ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో దేశ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసుకుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక స్థాయి అని ఆయన స్పష్టం చేశారు. 2025ఉ26 రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌర సరఫరాల శాఖ రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన రైతు అనుకూల విధానాల ఫలితంగానే ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో చారిత్రక రికార్డు సాధ్యమైందని పేర్కొన్నారు.

మిగతా 2 లో

## సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం
నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ
ఇద్దరు సభ్యుల బృందం ఏర్పాటు..
మూడు రోజుల్లో నివేదిక

2





2

## తెలుగు సినిమాలకు గద్దర్ అవార్డులు
ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం

2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది.



2

## గ్రూప్1 తీర్పు వాయిదా
వచ్చే నెల 5న తీర్పు
స్పష్టం చేసిన హైకోర్టు

గ్రూప్-1పై తెలంగా హైకోర్టు తీర్పు వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని డివిజన్ బెంచ్ వెల్లడించింది. తీర్పును వచ్చే నెల 5కు వాయిదా వేసింది.

## కేటీఆర్‌కు సిట్ నోటీసులు

- ఫోన్‌ట్యాపింగ్‌కేసులో జారీ
- నేడు జూబ్లీహిల్స్‌పీఎస్‌లో విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు.

2



## అటెన్షన్ డైవర్షన్ స్కీమ్
కేటీఆర్‌కు నోటీసులపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

3

## 27న బ్యాంకుల సమ్మె
బ్యాంకుల్లో ఐదురోజుల పని విధానానికి డిమాండ్

దేశవ్యాప్తంగా ఈనెల 27న సమ్మె నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగ సంఘాలుహెచ్చరించాయి. 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ప్రకటించాయి.

3




## కాలిబాట నుండి హెలికాప్టర్ వరకు
# మేడారం రాక

హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
మంత్రి సీతక్క

మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం హెలికాప్టర్ సేవలను ప్రారంభించారు.






4

## భోజ్‌శాలపై సుప్రీం కీలక ఆదేశాలు
ఇరు మతస్థుల పూజలు, ప్రార్థనలకు అనుమతి

మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల ఆలయం-కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రార్థనల విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాంతంలో శుక్రవారం హిందూ, ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. వసంత పంచమి సందర్భంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ హిందూ మతస్థులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది.



## తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృతభారత్ ఎక్స్‌ప్రెస్
నేడు కేరళలో జెండా ఊపనున్న ప్రధాని మోడీ

4



# కేటీఆర్‌కు సిట్ నోటీసులు

## నేడు జూబ్లీహిల్స్‌పీఎస్‌లో విచారణ

**హైదరాబాద్,జనవరి 22:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం నాడు ఉదయం 11:00 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలంటూ కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. సీఆర్‌పీసీ 160 కింద నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులను సిట్ అధికారులు అందజేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీస్ ఉన్నతాధికారుల్లో కొందరు ఇప్పటికే అరెస్ట్ అవగా.. ఇప్పుడు నాయకుల విచారణ జరుగుతోంది. ఈ కేసులో ఇటీవలే మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు.. ఆయన్ను కూడా ఇటీవల విచారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను పలు అంశాలపై విచారించిన అధికారులు.. కీలక సమాచారం రాబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. 'నిన్న నాకు నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌కు ఇచ్చారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పే దమ్ములేదు. రేవంత్ రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా వదలబోము. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా.. రేవంత్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన వెంటపడుతూనే ఉంటాం' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# గ్రూప్-1పై తీర్పు వాయిదా

**హైదరాబాద్,జనవరి 22:** గ్రూప్-1 పై గురువారం తెలంగా హైకోర్టు తీర్పు వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని హైకోర్టు డివిజన్ బెంచ్ వెల్లడించింది. గ్రూప్-1 పై వెలువరించాల్సిన తీర్పును వచ్చేనెల 5కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుతో 563 మంది గ్రూప్-1 అధికారుల భవితవ్యం తేలనున్నది. టీజీపీఎస్సీ 2024 లో గ్రూప్ 1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్షలో అవకతవకలు జరిగాయని హైకోర్టును ఆశ్రయించారు సెలెక్ట్ కాని అభ్యర్థులు. విచారణ అనంతరం సెలెక్షన్ లిస్టును రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది హైకోర్టు డివిజన్ బెంచ్. గత నెల 30 న పూర్తి వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్.. ఇవాళ నిర్ణయం వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది.

# సినిమాలకు గద్దర్ అవార్డులు

## ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 22:** 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.ఈ అవార్డుల వివరాలు వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

# స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా భారత్

## సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో గవర్నర్



**హైదరాబాద్,జనవరి 22:** ప్రధాని నరేంద్ర మోదీ.. దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మార్చాలని విజన్‌గా పెట్టుకున్నారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఆడారు గవర్నర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు కేవలం మెడల్స్ కోసమే కాదని.. దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపేందుకు స్పోర్ట్స్ ఒక శక్తిమంతమైన మార్గమని గవర్నర్ వివరించారు. స్వచ్ఛ భారత్ ఒక ఉద్యమంగా మారిందని, యోగాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధాని మోదీ పాలసీలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో ఆయన నాయకత్వ సామర్థ్యం అద్భుతమైనదని కొనియాడారు జిష్ణుదేవ్ వర్మ. ఈశాన్య రాష్ట్రాల నుంచి అన్ని మెడల్స్ వస్తాయని ఊహించలేదని, త్రిపుర నుంచి ఒలింపిక్స్‌కు పోటీ పడుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ మంత్రి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఇంత స్థాయిలో పాల్గొనడం సంతోషకరమని గవర్నర్ అభివర్ణించారు. క్రీడలు ప్రజలకు ఎన్నో నేర్పుతాయన్నారు. ఇది వికసిత్ భారత్ కోసం వేసే ముందడుగు అని.. 'స్వస్థ భారత్, శ్రేష్ఠ భారత్'కు ఇది తొలి అడుగు అని గవర్నర్ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

మొదటి పేజీ తరువాయి




నిగమ్లతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం, భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్ను యూపీసీ వోల్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ను కూడా సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3,000 మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. నెట్-జీరో సిటీ అభివృద్ధే తెలంగాణ విజన్‌లో కీలక భాగమని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు.

# వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ

## 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలపై విస్తృత చర్చ

## హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సుకు విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 22:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరల్డ్ ఎకనమిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలు, 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్', 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌పై సీఎం వివరించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జనవరిలో దావోస్‌లో జరిగే సదస్సులో తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలోఅప్ సమావేశం ఎంతో ఉపయోగకరమని ఆయన వివరించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఈ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీ4ఐఆర్ (సెంటర్‌ఫర్‌ది ఫోర్త్‌ఇండస్ట్రియల్‌రివ్యాల్యూషన్) నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్ కూడా సీఎం భేటీ అయ్యారు. తెలంగాణలో పరిశ్రమలకు ఉన్న అవకాశాలు, అనుకూల విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఆలోచనను సీఎం పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ఇలాంటి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, సమీప భవిష్యత్తులో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని ఎండీ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' నిర్వహిస్తున్నారని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి చూపుతోందని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లోని విభిన్న అంశాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ విజన్‌లో భాగస్వామ్యం పంచుకుంటామని, రాష్ట్ర ఆర్థిక వృద్ధి ప్రయాణంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరం కలిసి వస్తుందన్న సంకేతాలు ఇచ్చారు. హైదరాబాదులో ప్రతిభావంతమైన మానవ వనరులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సీఎం ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, క్రీడలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఆసియా 2024లో ప్రారంభించిన తెలంగాణ సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై కూడా చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరం భారతదేశంలో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ ఇదేనని, ఇది ఆదర్శ మోడల్‌గా గుర్తింపు సాధించిందని సీఎం గుర్తు చేశారు. పరిశ్రమల అభివృద్ధిలో ఉత్తమ పద్ధతులపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని జెరెమీ జర్గెన్స్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల అభివృద్ధి నమూనా, ఆర్థిక వృద్ధి వ్యూహం, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా, దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

# ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో తెలంగాణ రికార్డు

మొదటి పేజీ తరువాయి

పౌర సరఫరాల, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయడం, తెలంగాణ రైతాంగం సంపూర్ణ భాగస్వామ్యమే ఈ విజయానికి కారణమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కిందని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రం ఇంత భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. 2020ఉ21లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమిస్తూ, తాజా ఖరీఫ్ సీజన్‌లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలో కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్న రకాలకు తొలిసారిగా అందించిన బోనస్‌ను కలిపి మొత్తం రూ.18,532.98 కోట్లను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ సిబ్బంది పనితీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), ప్రజాపంపిణీ వ్యవస్థకు సరఫరా చేయడంతో పాటు, తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విదేశీ




ఎగుమతులకు ప్రత్యేక విధి విధానాలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు రైతులకు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ధాన్యం కొనుగోళ్ల ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.38 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ కావడం కూడా ఒక అరుదైన రికార్డేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, అంటే రాష్ట్ర జనాభాలో దాదాపు 85 శాతం మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నామని, ఇందుకు సంవత్సరానికి రూ.13,650 కోట్లు ఖర్చు అవుతోందని వెల్లడించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో నాణ్యత లోపాలు, బ్లాక్ మార్కెట్ అక్రమాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు గోదాముల ఆధునీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిల్వ సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఉందని, ఈ గోదాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని చెప్పారు. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో సైలో విధానంలో ఆధునిక గోదాములు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తేమ నియంత్రణతో నష్టాలను తగ్గించవచ్చని, ప్రారంభ ఖర్చు ఎక్కువైనా దీర్ఘకాలంలో లాభదాయకమని పేర్కొన్నారు. మిల్లింగ్ రంగంపై కూడా మంత్రి స్పందిస్తూ, నిబంధనలు పాటించిన మిల్లర్లకు పూర్తి సహకారం ఉంటుందని, తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ఉండదని స్పష్టం చేశారు. పెరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని మిల్లింగ్ పరిశ్రమకు ప్రోత్సాహక విధానాలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డ్రైయర్లు, పాడీ క్లీనర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని, అన్ని వేళలా రైతులకు అండగా ఉంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ

## ఇద్దరు సభ్యుల బృందం ఏర్పాటు.. మూడు రోజుల్లో నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 22 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్)లో పర్యటించనుంది. నైని కోల్ బ్లాక్ టెండర్లలో తలెత్తిన వివాదం, టెండర్లు రద్దు చేయాల్సిన పరిస్థితి, అందుకు గల కారణాలు సహా అన్ని అంశాలపై ఈ బృందం సమగ్ర విచారణ చేపట్టనుంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృంద సభ్యులుగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విచారణకు మూడు రోజుల గడువు విధించింది. ఈ లోగా సింగరేణిలో పర్యటించి, నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై నివేదిక సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుంది. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్లపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడంతో, తెలంగాణ డిప్యూటీ సీఎం, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే క్రమంలో ఎస్‌సీసీఎల్ కూడా టెండర్ నోటిఫికేషన్‌ను అధికారికంగా రద్దు చేసింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటల నుంచి బిడ్లు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, పాలనాపరమైన కారణాలతో టెండర్లు రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీఆరఎస్ హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా మారిందని, అదే సమయంలో సంస్థ అప్పులు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. సింగరేణి విద్యుత్ వినియోగానికి సంబంధించి జెన్‌కో, ట్రాన్స్‌కోలకు చెల్లింపులు చేయలేదని, టెండర్లు, కాంట్రాక్టులన్నీ కేసీఆర్ కుటుంబం నియంత్రణలోనే జరిగాయని విమర్శించారు. అదేవిధంగా, సింగరేణి సీఎస్ఆర్ నిధుల దుర్వినియోగం, ప్రైవేట్ కంపెనీలకు



నిబంధనలకు విరుద్ధంగా పనులు కట్టబెట్టడం జరిగిందని ఆరోపించారు. గత పదేళ్లలో రూ.32 వేల కోట్లకు పైగా సింగరేణి అప్పులు పెరిగాయని, కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పటి సీఎండీని మరో నాలుగు సంవత్సరాలు కొనసాగించారని, ప్రస్తుతం సింగరేణి ఇన్‌ఛార్జి సీఎండీతోనే నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# కాలిబాట నుండి హెలికాప్టర్ వరకు మేడారం రాక

- హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు, జనవరి 22:** మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుండి కార్ల మీద వచ్చిన భక్తులు నేడు ఎడ్ల బండ్లను వదిలి హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వృధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని, హనుమకొండ జిల్లా కేంద్రం నుండి మేడారం వరకు తిరిగి మేడారం నుండి హనుమకొండ కు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి 31 వేల రూపాయల టికెట్ నిర్ణయించిందని, అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి 4 వేల 8 వందల రూపాయల టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. గతంలో మహా జాతర సందర్భంగా అప్పటి పాలకులు నామమాత్రంగా నిధులు కేటాయించగా నేడు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం గద్దెల పునరుద్ధరణ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం 2 వందల 51 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. నేటి నుండి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్న థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది.

# 27న బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమ్మె

## ఐదురోజుల పని విధానానికి డిమాండ్




**హైదరాబాద్, జనవరి 22:** దేశవ్యాప్తంగా ఈనెల 27న సమ్మె నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగ సంఘాలుహెచ్చరించాయి. 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ప్రకటించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం కన్వీనర్ ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ), జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్(జిఐసి) వంటి సంస్థలలో కొనసాగుతున్న విధంగా తమకు 5 రోజులను అమలు చేయాలని గత 15 ఏళ్లుగా పోరాడుతున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ప్రతి రోజు 42 నిమిషాలు అధికంగా పనిచేస్తామని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ సెక్టార్(ఃజీనీతినిణ ఃూౌఇ-బినీస)లో పనిచేస్తున్న వారు సామాజిక జీవితానికి దూరం అవుతున్నందున ఈ విధానాన్ని అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పని దినాలను తప్పనిసరిగా అమలు చేయాలని గత ఏడాది మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల సమ్మెకు పిలుపునివ్వడంతో అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆంజనేయ ప్రసాద్ గుర్తు చేశారు. 9 నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఖాతాదారులు సైతం తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించుకునేందుకు జరుగుతున్న సమ్మెకు మద్దతు పలకాలని ఆంజనేయ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. 2024 మార్చిలో వేతన సవరణ సెటిల్‌మెంట్ సమయంలో మిగతా రెండు శనివారాలు కూడా సెలవు ఇచ్చేందుకు ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ), యూఎఫ్‌బీయూ మధ్య అంగీకారం కుదిరింది. తాజాగా ప్రకటించిన ఈ సమ్మె కార్యరూపం దాలిస్తే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలపై వరుసగా మూడు రోజుల పాటు ప్రభావం పడనుంది. జనవరి 25, 26 తేదీల్లో బ్యాంకులకు సెలవులు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు ఆదివారాలతో పాటు రెండవ, నాలుగో శనివారాలు సెలవు పొందుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి

## బిల్లులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది

## డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క హామీ



**కొమురం భీం, జనవరి 22:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధి దారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. జైనూర్ మండలంలోని జంగాం గ్రామంలో భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు రూ. 3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సంద్భంగా భట్టి మాట్లాడుతూ.. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పని లో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు. కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటామని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాడుకోవడం కోసం రుణాలు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని మహాలక్ష్మి ల్లాగా ఉన్నారు.. మహిళలకు ఇప్పటికే రూ. 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. మహిళల్ని కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే మేము డబ్బులు కడుతున్నామని తెలిపారు. నాడు వెయ్యి రూపాయలు లేని పరిస్థితిలో ఉన్న మహిళను నేడు బస్సులకు ఓనర్లను చేశాం.. చెప్పినట్టుగానే ధరణి తీసి భూ భారతి తెచ్చామని భట్టి తెలిపారు. కొమరం భీం ప్రాజెక్ట్ కెనాల్ కాలేదు అన్నారు.. వారికి ప్రపోజల్స్ పంపారు.. పనులు త్వరలో ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చారు. దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం ఇస్తున్నాం.. 96 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట, ప్రజా బాట పట్టారు. మీ సమస్యలు పరిష్కారం చేస్తారు. వారిని కలవండని గ్రామస్తులకు సూచించారు. 108 తరహాలో విద్యుత్ సమస్యల పైన 1912 ను సంప్రదించండి విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తారని అన్నారు. మీ ప్రాంత సమస్య లను పరిష్కారం కోసం ఓ అంబులెన్స్ వస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

# ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

## ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం

## యువతకు శిక్షణ అందించాలన్న సిఎం

**దావోస్, జనవరి 22:** దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏ ఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏ ఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఏ ఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఓయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏ ఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్సన్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన ఏ ఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏ ఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ తో కుదిరిన ఎంఓయూ ద్వారా స్టార్టప్‌ల అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్‌లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించ నున్నారు.



# అటెన్షన్ డైవర్షన్ స్కీమ్

## కేటీఆర్‌కు నోటీసులపై బిఆర్ఎస్ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, జనవరి 22:** కెటిఆర్‌కు సిట్ నోటీసులపై బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఇదంతా కేవలం డైవర్షన్ స్కీమ్ అంటూ విమర్శలు గుప్పించారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేక .. నిన్న నాకు, ఇవాళ కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు వెంట పడుతూనే ఉంటామన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా సీఎం ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బామ్మర్ది బాగోతం బయటపెట్టడంతో ఈ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం నుంచి సడీచప్పుడు లేకుండా ఇప్పుడే నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు కాంగ్రెస్ సర్కారు నాటకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పాలన గాలికి వదిలి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నాలు ఇవి. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్టాన్ని ప్రజల కర్మానికి వదిలేసి దావోస్, అమెరికా పర్యటన పెట్టుకున్నారు. సర్కారు డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని న్యాయస్థానాలు తేల్చి చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మొగలి రేకులు సీరియల్ నడిపిస్తోంది. రేవంత్‌రెడ్డి విదేశాల్లో విహరిస్తూ అక్కడి నుంచి వచ్చే వరకు ఈ సీరియల్ నడిచేలా ఎ÷-లాన్ చేసినట్లు అనిపిస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల వెన్ను విరిచారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదం అని నిరంజన్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల క్రితం నమోదైన కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని బీఆర్ఎస్ నేత సోమా భరత్ విమర్శించారు. 'నోటీసు ఇచ్చి .. విచారణకు వచ్చేందుకు కనీసం 24 గంటల సమయం కూడా ఇవ్వలేదు. రెండ్రోజుల క్రితం మరో సీనియర్‌నేత హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చారు. కేవలం ప్రశ్నిస్తున్న పార్టీ లక్ష్యంగానే నోటీసులు ఇస్తున్నారు. సిట్ ఎందుకు వేశారో కూడా తెలియదు. ఒక పద్ధతి లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ అక్రమాలను బయటపెడుతుంటే నోటీసులు ఇస్తున్నారు. విచారణకు కేటీఆర్‌తో పాటు న్యాయవాదిని అనుమతించాలని కోరాం. సాక్షిగా విచారణ చేసినప్పుడు న్యాయవాదిని అనుమతించబోమని ఏసీపీ చెప్పారని భరత్ తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

## పట్టుబడ్డ 270మందికి జైలు శిక్ష



**హైదరాబాద్,జనవరి 22:** 2026 న్యూ ఇయర్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవర్‌లో పట్టుబడిన వారిలో 270 మందికి జైలు శిక్ష విధించారు. 2025 డిసెంబర్ 24 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వందలాది మంది పట్టుబడ్డారు. ఈ కేసుల్లో విచారణ చేపట్టిన నగరంలోని పలు న్యాయస్థానాలు మొత్తం 270 మందికి జైలు శిక్ష విధిస్తూ తీర్పులు వెలువరించాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన నిందితుల వివరాలను వారి కార్యాలయాలు, కళాశాలలకు పంపిస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు సిఫారసులు చేస్తున్నట్లు వెల్లడించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు కోరారు.

# గోద్రేజ్ చైర్మన్‌తో మంత్రుల భేటీ

## ఫ్యూచర్ సిటీలో హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చ

## హైదరాబాద్ సందర్శించాలని కోరి శ్రీధర్ బాబు



**దావోస్,జనవరి 22:** ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు(ఏఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ. 150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు ముఖ్యంగా స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైదరాబాద్‌కు రావాలని శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.

జనం పవర్
JANAM POWER

శుక్రవారం
23 జనవరి 2026



సంపాదకీయం

# గిరిజన జాతర.. మేడారం!

కొయ్య సెక్కితె బొమ్మరా.. కొలిచి మొక్కితె అమ్మరా..! అంటూ కవి అందెశ్రీ పాడిన పాట ఎంతో అద్భుతమైనది. అందులో ఆధ్యాత్మిక తత్వ చింతనను బాగా వెలవరించారు. భారతదేశ పురాణఇతిహాసాల్లో విగ్రహాలు, దేవుళ్లు, పూజలు కూడా అంతా నమ్మకం, విశ్వాసం, భక్తిపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే చెట్టు, పుట్టా, గాలీ,నీరు, రాయిరప్పా అన్నీ మనకు దైవాలే. మనకు మేలుచేస్తున్న ప్రకృతిని దైవంగా కొలవడం ఒక్క భారతీయ సంస్కృతిలోనే చూస్తున్నాం. నమ్మకంతో పూజించడం మన ఆచారం. అది దేవత కావచ్చు.. మైసమ్మ, మారెమ్మ ఇలా ఏ రూపంలో అయినా గ్రామదేవతనలు కొలవడం ఆచారంగా వస్తోంది. అలాంటి ఓ అద్భుతమైన ఆచారంతో కోట్లాదిమంది ఆరాధ్యదైవాలుగా వెలిసిన వారే సమ్మక్క- సారలమ్మలు. సామాన్యమైన గిరిజన కుటుంబానికి చెందిన వీరు అసామాన్యంగా భక్తులు మనస్సులో నిలిచిపోయారు. కేవలం గిరిజనుల నమ్మకం ఇప్పుడు సమస్త జనజాతికి నమ్మకంగా, ఆరాధ్యంగా ఆ దేవతలు వెలిశారు. రెండేళ్లకోమారు జరిగే మేడారాం గిరిజన జాతర చూస్తే..ఆ అమ్మలు జనహృదయంలో ఎంతగా గూడుకట్టుకున్నారో చెప్పలేం. ఇదంతా అమ్మల మీద ఉన్న గౌరవం కావచ్చు..నమ్మకం కావచ్చు.. విశ్వాసం కావచ్చు.. కొలిచి మొక్కిన వారికి కొండంత వేల్పులుగా వారు నిలిచి పోయారు. గుడిలేదు.. గంటలు లేవు...కట్టుబాట్లు లేవు..పూజలు, ఆరాధనలు, హారతులు వంటివి ఏవీ లేకుండా నేరుగా అమ్మలను తలచుకుని రావడం అన్న ఆధ్యాతిక జాతర బహుశా ప్రపంచంలో ఎక్కడా కానరాదు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రారంభం కాబోతున్నది. ప్రారంభానికి ముందే వేలాదిగా భక్తులు తరలివచ్చి గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇది కేవలం జాతర మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు మేడారం అమ్మవార్లను దర్శించుకుంటారు. కుంభమేళా తర్వాత కోట్ల సంఖ్యలో భక్తులను ఆకర్షించే అతిపెద్ద ఉత్సవంగా నిలిచింది. నాలుగు రోజుల జాతరలో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది గద్దెలను అభివృద్ధి చేశారు. జాతరకు నెల ముందు నుంచే లక్షలాది మంది మేడారానికి పోటెత్తారు. నిజానికి వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లి-కూతుర్లు... తెలంగాణ ప్రాంతాన్ని కాకతీయ రాజులు సుమారు 700 సంవత్సరాలు పరిపాలించారు. సమ్మక్క సారలమ్మలు జగిత్యాల జిల్లా ప్రాంతానికి చెందిన గిరిజన జాతికి చెందినవారు. గిరిజనుల దొర మేడరాజు అడవిలో వేటాడుతుండగా.. ఒక పుట్టపై పులులు, సింహాలు కాపలాగా ఉన్న పసిపాప సమ్మక్కను చూసి.. ఆ పాపను తీసుకెళ్లి పెంచుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది. అప్పటి వరకు కరువు.. కాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు... సమ్మక్క రాకతో సమస్యలు తగ్గిపోయాయి. అంతేకాదు.. ఎలాంటి జబ్బునైనా ఆమె చేతి పసరుతో రోగాలు నయమయ్యా యని చెబుతుంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత సమ్మక్కను మేడారం పాలకుడు.... గిరిజన దొర...తన మేనల్లుడు అయిన పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవనంలో సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు కలిగారు. మేడరాజు పొలవాస ప్రాంతానికి కోయ రాజు కాగా... పగిడిద్ద రాజు మేడారాన్ని పాలించాడని చరిత్ర చెబుతోంది. కాకతీయ సామ్రాజ్యం విస్తరణలో భాగంగా, కాకతీయ మొదటి ప్రభువు మేడరాజు పాలించిన ప్రాంతాన్ని ఆక్రమించేందుకు దండెత్తాడు. ఈ దాడిని తట్టుకోలేక మేడరాజు తన కుమార్తె సమ్మక్క దగ్గర మేడారంలో ఆశ్రయం పొందుతాడు. పగిడిద్ద రాజు కాకతీయుల సామంతుడిగా ఉంటూ, వారికి ప్రతి నెలా కప్పం కట్టేవాడు. మూడు సంవత్సరాలుగా ఏర్పడిన కరువుల వల్ల కప్పం కట్టలేకపోవడం... మేడరాజుకు ఆశ్రయం ఇవ్వడం వంటి కారణాలతో కాకతీయులు ఆగ్రహించి మేడారంపై దండెత్తారు. కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొనేంత బలం లేకపోయినా.. పగిడిద్ద రాజు, సమ్మక్క, సారక్క, వారి పిల్లలు సారలమ్మ, నాగులమ్మ, జంపన్నతో సహా కోయ ప్రజలంతా యుద్ధానికి సిద్ధమయ్యారు. బలమైన ఆయుధాలు, గుర్రాలు, ఏనుగులతో వచ్చిన కాకతీయ సైన్యంతో వందల సంఖ్యలో ఉన్న కోయ ప్రజలు బాణాలు, మొండి కత్తులతో భీకరంగా పోరాడారు. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ వీరమరణం పొందారు. కుటుంబ సభ్యుల మరణాలను చూసిన జంపన్న.. అవమానాన్ని భరించలేక పక్కనే ఉన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తున్నారు. తన కుటుంబ సభ్యులందరూ మరణించారని తెలిసిన సమ్మక్క, ఏమాత్రం వెనుకాడకుండా కాళీమాతలా విజృంభించి శత్రువులను ఎదుర్కొంది. అయితే, వెనుక నుంచి ఒక సైనికుడు దొంగచాటున పొడిచి సమ్మక్కను తీవ్రంగా గాయపరిచాడు. రక్తం కారుతుండగానే ఆమె చిలుకల గుట్ట వైపు వెళ్లి, నెమలినార చెట్టు కింద ఉన్న పుట్ట దగ్గర కుంకుమ భరిణెగా మారి అదృశ్యమైందని చెబుతుంటారు. సమ్మక్క అదృశ్యమైన తర్వాత, గిరిజన ప్రజలకు ఆకాశం నుంచి కొన్ని మాటలు వినిపించాయి. 'ఈ గడ్డమీద పుట్టిన ప్రతి ఒక్కరూ వీరుడిలా రాజ్యాన్ని పాలించాలని, ఇక్కడ రెండు గద్దెలు కట్టి రెండేళ్లకొకసారి ఉత్సవం జరిపిస్తే వారి కోరికలు నెరవేరుస్తాను' అని ఆ మాటల సారాంశం. ఈ మాటలను అమ్మ ఆదేశంగా భావించిన గిరిజనులు.. అప్పటి నుంచి అమ్మలకు జాతర నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంలో ఈ మహా జాతర జరుగుతుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరలో అనేక సంప్రదాయాలు పాటిస్తారు. మొదటిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకొస్తారు. రెండవ రోజు చిలుకల గుట్టలోని కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు. మూడవ రోజు అమ్మవార్లు సమ్మక్క, సారక్క ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. నాలుగవ రోజు సాయంత్రం వారికి ఆవాహన పలికి తిరిగి వనప్రవేశం చేయిస్తారు. దీంతో మేడారం జాతర ముగుస్తుంది. ఈ పూజలను వంశపారంపర్యంగా గిరిజన పూజారులే నిర్వహిస్తారు. అమ్మవార్లకు బంగారంగా బెల్లాన్ని సమర్పించు కోవడం ఇక్కడి ప్రత్యేక ఆచారం.

# వీబీ జీ రామ్ జీకు వ్యతిరేకంగా ఆందోళన

- పార్లమెంట్ వేదికగా పోరాడుతాం
- విపక్ష నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, జనవరి 22:** ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ బిల్లు 'వీబీ జీ రామ్ జీ'కు వ్యతిరేకంగా పేద ప్రజలంతా ఏకం కావాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. కేంద్రం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని వెనక్కి తీసుకుని ఎంజీఎన్ఆర్ఈజీఏను పునరుద్ధరించేంత వరకూ తాము పోరాడతామని చెప్పారు. దీనిపై పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లోనూ పోరాటం సాగిస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం ఉద్దేశం, గతంలో తీసుకువచ్చిన 'మూడు నల్ల వ్యవసాయ చట్టాల' ఉద్దేశం ఒకటేనని విమర్శించారు. జవహర్ భవన్‌లో గురువారం నాడు జరిగిన నేషనల్ ఎంజీఎన్ఆర్ఈజీఏ కార్మికుల సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశానికే చరమగీతం పాడాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. రాజుల పాలనలా ఇండియాను మార్చాలని బీజేపీ అనుకుంటోందన్నారు. పేద ప్రజలందరికీ పని హక్కును ఎంజీఎన్ఆర్ఈజీఏ కల్పిస్తే, ఆ ఉద్దేశాన్ని దెబ్బతీయడమే బీజేపీ, మోదీ కోరిక అని తప్పుబట్టారు. కొద్దికాలం క్రితం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వాళ్లు తెచ్చారని, అంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాటం జరిపామని, రైతులు దాన్ని అడ్డుకున్నారని గుర్తు చేసారు. దాంతో ఆ నల్ల చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. రైతుల విషయంలో అప్పుడు చేసినట్టే ఇప్పుడు అదే పని కార్మికుల విషయంలోనూ చేస్తున్నారని అన్నారు. కొత్త చట్టంతో బీజేపీ పాలిత రాష్ట్రాలకే పనులు, నిధులను కేంద్రం కేటాయిస్తుందని చెప్పారు. పేద ప్రజల పని హక్కును కేంద్రం హరిస్తూ, ఆధునిక భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని కుట్ర జరుపుతోందని రాహుల్ ఆరోపించారు. కేంద్రాన్ని అడ్డుకునేందుకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ప్రతిఒక్కరూ ఐక్యంగా నిలబడినప్పుడే కేంద్రం వెనక్కి తగ్గుతుందన్నారు. ఈ సదస్సులో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృతభారత్ ఎక్స్‌ప్రెస్

నేడు కేరళలో జెండా ఊపనున్న ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ,జనవరి 22:** తెలుగు రాష్ట్ర రైల్వే ప్రయాణికులకు శుభవార్త. మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తెలుగు ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా ఈ అమృత్ భారత్ రైలు నడవబోతోంది. 23న శుక్రవారం కేరళ రాజధాని తిరువనంతపురం నుంచి ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. తిరువనంతపురం- చర్లపల్లి మధ్య ఈ అమృత భారత్ రైలు నడవనుంది. అప్పటికే చర్లపల్లి-ముజఫర్ పూర్ (బీహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. తిరువనంతపురం-చర్లపల్లి మధ్య నడిచే ఈ రైలు తెలంగాణకు కేటాయించిన రెండో అమృత్ భారత్ రైలు. ఈ రైలు ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి ఉదయం 7.15కు బయలుదేరి.. మరుసటి రోజు (బుధవారం) మధ్యాహ్నం 2.45కు తిరువనంతపురం చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరిగి బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి, తర్వాతి రోజు రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. రైలు తెలంగాణలోని నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆధునిక పద్ధతుల్లో, స్వదేశీ సాంకేతికతతో డిజైన్ చేశారు. వివిధ సౌకర్యాలను అందించే ఈ రైళ్లు అందుబాటు ధరల్లోనే ప్రయాణికులకు సేవలు అందించబోతున్నాయి.

## స్వల్పంగా దిగివచ్చిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ,జనవరి 22 :** బంగారం.. వెండి ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. గత కొద్దిరోజులగా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గోల్డ్, సిల్వర్ పోటాపోటీగా రాకెట్‌లా దూసుకుపోయాయి. సరికొత్త రికార్డ్‌లు సృష్టిస్తూ కొనుగోలుదారులను బెంబేలెత్తించాయి. అలాంటిది బుధవారం అగ్ర రాజ్యాధినేతల నుంచి వచ్చిన సానుకూల ప్రకటనలు పసిడి పరుగులకు బ్రేక్‌లు పడేలా చేశాయి. భారతదేశంతో వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకుంటున్నట్లు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా లేయెన్ ప్రకటించారు. అలాగే అతి త్వరలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని ట్రంప్ ప్రకటించారు. ఈ ఇద్దరి నేతల ప్రకటనతో బంగారం, వెండి ధరలు దిగొచ్చినట్లుగా కనబడుతోంది. ఈరోజు తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. ఇది కూడా చదవండి: ఉసబీపూ: 'బోర్డ్ ఆఫ్ పీస్'పై అగ్ర రాజ్యాలు ఘర్షణ.. కారణమిదేనా!? తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,54,310 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.2,100 తగ్గడంతో రూ.1,41,450 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,720 తగ్గడంతో రూ.1,15,730 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక సిల్వర్‌కు బ్రేకులు పడ్డాయి. ఈరోజు కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.3,40,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది.





## భోజ్‌శాలపై సుప్రీం కీలక ఆదేశాలు

ఇరు మతస్థుల పూజలు, ప్రార్థనలకు అనుమతి

**భోపాల్, జనవరి 22:** మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల ఆలయం-కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రార్థనల విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాంతంలో శుక్రవారం హిందూ, ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. వసంత పంచమి సందర్భంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ హిందూ మతస్థులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ ముస్లింలు శుక్రవారం ప్రార్థనలు చేసుకోవచ్చని అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాల్లో పేర్కొంది. నమాజ్ చేసుకునేందుకు వచ్చే ముస్లిం కమ్యూనిటీ వ్యక్తుల జాబితాను జిల్లా యంత్రాంగానికి అందజేయాల్సి ఉంటుందని సీజేఐ సూర్య కాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పాంచోలితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఇరువర్గాల వారు పరస్పరం గౌరవించుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని సూచించింది. భోజ్‌శాల 11వ శతాబ్దం నాటి కట్టడమని, సరస్వతీ దేవి ఆలయమని హిందువుల వాదనగా ఉంది. ముస్లింలు దీనిని కమల్ మౌలా మసీదుగా పిలుస్తుంటారు. 2003లో ఇందుకు సంబంధించి ఏఎస్ఐ ఆదేశాలు ఇచ్చింది. శుక్రవారం నమాజ్‌లు మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ చేసుకోవచ్చని, హిందువులు వసంత పంచమి పూజలు నిర్వహించుకోవచ్చని, ప్రతి మంగళవారం వారికి అనుమతి ఉంటుందని సుప్రీం ఆదేశాల్లో పేర్కొంది. అయితే.. వసంత పంచమి శుక్రవారం నాడు వస్తే ఎలాంటి ఏర్పాట్లు చేయాలనేది అందులో పేర్కొనలేదు. ఈసారి జనవరి 23న వసంత పంచమి, శుక్రవారం కలిసి రావడంతో ఇరువర్గాలు తమ మతపరమైన ప్రార్థనలు నిర్వహించు కునేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరాయి.

## ఎర్రచందనం పట్టివేత

**రైల్వే కోడూరు,జనవరి 22:** అక్రమంగా కారులో తరలిస్తున్న 28ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే కోడూరు టాస్క్ ఫోర్స్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో నెల్లూరు- గూడూరు మార్గంలో వెళుతున్న వాహనాలను తనిఖీ చేపట్టారు. వీరు వెంకటాచలం చెక్ పోస్టు వద్దకు చేరుకోగా, ఒక మోటారు సైకిల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, వీరితో పాటు వెనకే వస్తున్న ఒక కారును అడ్డగించి,కారును ఆపిన వెంటనే అందులోని వ్యక్తులు దిగి పారిపోయే ప్రయత్నం చేయగా టాస్క్ ఫోర్సు పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని కారులో తనిఖీ చేయగా అందులో 28ఎర్రచందనం దుంగలు లభించాయని అన్నారు. నలుగురిని నెల్లూరు,తిరుపతి జిల్లాలకు చెందిన వారిగా గుర్తించి వీరిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

## క్రొయేషియాలో భారత ఎంబసీపై దాడి..

ఎంఈఏ తీవ్ర అభ్యంతరం

**న్యూఢిల్లీ:** ఐరోపా దేశం క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి ఖలీస్థానీ వేర్పాటువాదులు చొరబడి విధ్వంసం సృష్టించడంపై భారత్ ఘాటుగా స్పందించింది. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో కోరింది. వియన్నా తీర్మానం ప్రకారం దౌత్య ప్రాంగణంలో నిబంధనల ఉల్లంఘన జరగరాదని, ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా రక్షణ కల్పించాల్సి ఉంటుందని ఎంఈఏ పేర్కొంది. 'భారత వ్యతిరేక శక్తులు మా రాయబార కార్యాలయంలో చొరబడి విధ్వంసం సృష్టించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ వ్యవహారాన్ని ఢిల్లీ, జాగ్రెబ్‌లోని క్రొయేషియా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాం. ఇలాంటి ఘటనలు వాటి వెనుక ఉన్న వ్యక్తుల స్వభావం, ఉద్దేశాలను సూచిస్తాయి. చట్టాన్ని అమలుచేసే సంస్థల అధికారులు వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలి' ఎంఈఏ పేర్కొంది. కాగా, జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి కొందరు ఖలిస్థాన్ వేర్పాటువాదులు చొరబడి విధ్వంసం సృష్టించినట్టు గురువారం ఉదయం వార్తలు వెలువడ్డాయి. భారత రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఈయూ నేతలు న్యూఢిల్లీలో పర్యటించనున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది.

### క్రొయోషియాలో మోదీ పర్యటన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది క్రొయేషియాలో పర్యటించారు. ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా కూడా ఆయన రికార్డును సొంతం చేసుకున్నారు. జాగ్రెబ్‌లో మోదీకి క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ సాదర స్వాగతం పలికారు. ద్వైపాక్షిక సమావేశంలో ఇరువురు నేతలు పాల్గొన్నారు. భారత విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్



మిస్రీలు కూడా హాజరయ్యారు. మోదీ పర్యటనలో వ్యవసాయం, సంస్కృతి, సైన్స్ రంగాల్లో నాలుగు ఎంఓయూలపై సంతకాలు .జరిగాయి.

# జన్నారంలో యథేచ్ఛగా భూకబ్జాలు

అధికారుల అండతోనే అక్రమ నిర్మాణాలు?







**జితేందర్ - జనం పవర్ స్టేట్ ఇంచార్జ్**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి, ఇరిగేషన్ స్థలాలు, చెరువు శిఖం భూములు కబ్జాదారుల పాలవుతున్నా.. సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక నాయకులు, సామాజికవేత్తలు మండిపడుతున్నారు.

## కళ్లముందే కబ్జాలు.. పట్టించుకోని యంత్రాంగం

మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఎంపీడీవో కార్యాలయాల వెనుక ఉన్న 5 ఎకరాల 8 గుంటల ప్రభుత్వ భూమి ప్రతిరోజు అధికారుల కళ్లముందే అక్రమణకు గురవుతున్నా, వారు కనీసం అటువైపు చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత వారం రోజులుగా కమ్మన్‌పల్లి గ్రామంలో ఇరిగేషన్ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## నామమాత్రపు విచారణలు.. కాసుల వేట!

భూకబ్జాలపై సామాజిక కార్యకర్తలు నల్లపు కృష్ణ, మామిడి విజయ్ మరియు పలు రాజకీయ పార్టీల నాయకులు ఫిర్యాదు చేసినప్పుడు, అధికారులు కేవలం 'నోటీసులు ఇచ్చాం' అని చెప్పి కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు అందినప్పుడు నామమాత్రపు విచారణ జరపడం.కబ్జాదారులతో కుమ్మక్కై భారీగా సొమ్ము తీసుకుంటున్నారనే ఆరోపణలు. 'పై అధికారులకు నివేదిక పంపాం' అంటూ సాకులు చెప్పడం సర్వసాధారణమైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

***"ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందో అక్కడ కనీసం 'ఇది ప్రభుత్వ భూమి' అని బోర్డులు కూడా పెట్టడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కబ్జాదారులకు వరంగా మారింది." - నల్లపు కృష్ణ, సామాజికవేత్త.***

## కలెక్టర్ స్పందించాలని విజ్ఞప్తి

జిల్లా కలెక్టర్‌కు 'ప్రజావాణి'లో పలుమార్లు ఫిర్యాదు చేసినా మండల స్థాయిలో పరిస్థితుల్లో మార్పు రావడం లేదని నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్డీవో తక్షణమే స్పందించి జన్నారం మండలంలో అక్రమాలకు గురైన ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపించాలి. కబ్జాదారులకు సహకరిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కమ్మన్‌పల్లి మరియు ఇతర ప్రాంతాల్లో జరిగిన అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలి. ప్రభుత్వ భూముల చుట్టూ రక్షణ కంచె వేసి బోర్డులు ఏర్పాటు చేయాలి.ప్రభుత్వ ఆస్తులను కాపాడి, సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని మండలంలోని పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

# సంగారెడ్డి కాంగ్రెస్‌కు మరో షాక్

- గులాబీ గూటికి యువ నాయకుడు లాడే బాలు
- హరీశ్ రావు సమక్షంలో 100 మందితో చేరిక
- మున్సిపల్ ఎన్నికల వేళ మారుతున్న సమీకరణాలు



**సంగారెడ్డి, జనవరి 22 ( జనం పవర్):**

మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సంగారెడ్డి రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన 9వ వార్డు యువ నాయకుడు లాడే బాలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో, మాజీ మంత్రి హరీశ్ రావు సమక్షంలో తన 100 మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హరీశ్ రావు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవలే పొన్న రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడగా, ఇప్పుడు బాలు కూడా వెళ్లడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది. కాంగ్రెస్‌లో తమకు తగిన గుర్తింపు లేదని, అందుకే పార్టీని వీడుతున్నట్లు బాలు స్పష్టం చేశారు. అధికార పార్టీ నుంచి వరుసగా నాయకులు వస్తుండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సంగారెడ్డి గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు.

# సంగారెడ్డిలో సైన్స్ ఫెయిర్ సందడి

- నాలుగో రోజు 11 వేల మంది విద్యార్థుల రాక
- ఆకట్టుకున్న 'హోప్ ఎమర్జెన్సీ అలారం'
- మూఢనమ్మకాలపై జన విజ్ఞాన వేదిక అవగాహన




**సంగారెడ్డి, జనవరి 22 ( జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కొల్లూరు క్యాంపస్‌లోని గాడియం స్కూల్‌లో జరుగుతున్న సదర్న్ ఇండియా సైన్స్ ఫెయిర్‌ఉ



2026 (ఎస్ఐఎస్ఎఫ్) నాలుగో రోజు ఉత్సాహంగా సాగింది. తెలంగాణలోని ఆరు జిల్లాల నుంచి సుమారు 11 వేల మంది విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు.

## ఆకట్టుకున్న ఆవిష్కరణలు

విద్యార్థులు రూపొందించిన స్పేస్ ఆన్ వీల్స్, మహిళల రక్షణ జాకెట్, బొటనవేలు ముద్రతో ఓటింగ్ విధానం, స్మార్ట్ వ్యవసాయం వంటి ప్రాజెక్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎన్‌జీఓలు ఏర్పాటు చేసిన ఆకుల కళ (లీఫ్ ఆర్ట్) స్టాల్స్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాయి. సెంట్ పీటర్స్ స్కూల్ విద్యార్థిని ప్రశస్తి రూపొందించిన 'హోప్ ఎమర్జెన్సీ అలారం' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒంటరిగా నివసించే వృద్ధులు లేదా ఇతరులు ప్రమాదవశాత్తు కింద పడిపోతే, ఈ పరికరం ఆటోమేటిక్‌గా పోలీసులకు సమాచారం పంపిస్తుందని విద్యార్థిని వివరించారు.

# ఆసిఫాబాద్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

**గుండి, లక్మాపూర్ వంతెనలకు నిధులు ఇవ్వాలని వినతి**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన**

**పాల్గొన్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీష్ బాబు**



**జనం పవర్ - ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబుతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.నియోజకవర్గంలో ప్రధాన సమస్యలైన రోడ్ల నిర్మాణం, మౌలిక వసతులు, సాగునీరు, వ్యవసాయ రంగ సమస్యలపై ఎమ్మెల్యేలు ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా గుండి, లక్మాపూర్ వంతెనల నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జాబరి రవీందర్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ హెచ్‌ఓ గా బన్సిలాల్ బాధ్యతల స్వీకరణ



**జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

చెన్నూరు పట్టణ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ హెచ్ వో గా సీఐ. బన్సిలాల్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని ఆయన సూచించారు. పెండింగ్ కేసుల వివరాలను కూడా ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# గురుకుల ప్రవేశాలకు 25 ఆఖరు

**5వ తరగతి, 6-9 తరగతుల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు**

**ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్ష: డీసీవో రామ కళ్యాణి**

**మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచన**

**జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**



వచ్చే విద్యా సంవత్సరం (2026-27)కి గాను తెలంగాణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, అలాగే 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లక్సెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, డీసీవో కోటూరి రామ కళ్యాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

**దరఖాస్తు విధానం - అర్హతలు**

టీజీ సెట్-2026 ద్వారా ఈ ప్రవేశాలు కల్పిస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీయే చివరి గడువు అని తెలిపారు. ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, జనరల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరి ఫైనాన్స్ స్కూల్స్‌లో మాత్రం రాష్ట్రస్థాయి మెరిట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ఆసక్తి గలవారు దగ్గర్లోని మీసేవ లేదా ఇంటర్నెట్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుము రూ. 100 చెల్లించాలి. ఒక ఫోన్ నెంబర్ మీద ఒక విద్యార్థి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో విద్యార్థి ఫొటో, సంతకం, కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు 2025-26 స్టడీ సర్టిఫికెట్ జతపరచాలి. 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలకు దరఖాస్తు చేసేవారికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి.

# టీవీవీపీ ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'

**కొత్తగా ఫార్మసీ సూపర్ వైజర్ పోస్టులు**

**ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ**

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా వెల్లడి**



**హైదరాబాద్/కరీంనగర్, జనవరి 22 (జనం పవర్):**

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను (టీవీవీపీ) త్వరలో 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్'గా మార్చబోతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌లో కొత్తగా అదనపు ఫార్మసీ సూపర్ వైజర్ పోస్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటన పట్ల యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పరాబ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రామారావు, గౌరవాధ్యక్షులు సోమ మల్లన్న, పాండు, ఇతర నాయకులు అమృత రావు, శివ కుమార్, సునీత, శ్రీజ్యోతి, హయగ్రీవ చారి, ట్రెజరర్ శిరీష, జిల్లాల నుంచి వచ్చిన ఫార్మసిస్ట్‌లు పాల్గొన్నారు.

# కష్టపడే వారికే కాంగ్రెస్ టికెట్లు

**మున్సిపల్ ఎన్నికల్లో వారికే ప్రాధాన్యం**

**పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి**

**జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**




**జుక్కల్, జనవరి 22 (జనం పవర్):**

కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో కష్టపడే కార్యకర్తలకే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ స్పష్టం చేశారు. బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్తో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలంగా నిలబడడానికి కార్యకర్తలే మూలస్తంభాలని, వారి శ్రమకు తగిన గుర్తింపు తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. బిచ్కుంద మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులు ఉన్నాయని, అక్కడ పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడ్డారని ప్రశంసించారు. అయితే నిబంధనల ప్రకారం 12 మందికి మాత్రమే టికెట్లు ఇవ్వగలమని, టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని సూచించారు. వారికి భవిష్యత్తులో పార్టీ మరిన్ని అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. టికెట్ ఎవరికిచ్చినా పార్టీ నిర్ణయాన్ని గౌరవించి, అందరూ ఐక్యతతో కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత ఆశల కంటే పార్టీ విజయం ముఖ్యమని, బిచ్కుంద మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ వేదికగా ఐద్వా జాతీయ మహాసభలు

- పొనకల్‌లో కరపత్రాల విడుదల
- 25 నుంచి 28 వరకు సభలు: కన్వీనర్ పోతు విజయశంకర్
- మహిళల సమస్యలపై పోరాటమే లక్ష్యం



**జితేందర్ - జనం పవర్ స్టేట్ ఇంచార్జ్**

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 25 నుంచి 28 వరకు హైదరాబాద్ వేదికగా తొలిసారిగా జరగనున్న ఈ మహాసభలకు మద్దతుగా ఐద్వా మండల కన్వీనర్ పోతు విజయశంకర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయశంకర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా మహిళలకు పూర్తిస్థాయి రక్షణ, సమానత్వం కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మద్యం ఏరులై పారుతుండటంతో పురుషులు అకాల మరణం పాలవుతున్నారని, దీంతో ఒంటరి మహిళల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. మార్కెట్ శక్తులు స్త్రీని కేవలం విక్రయ వస్తువుగా చూస్తున్నాయని, అధిక ధరలు, ఉపాధి లేమి, భ్రూణ హత్యలు వంటి సమస్యలు మహిళలను పట్టిపీడిస్తున్నాయని విమర్శించారు. హింస, అణిచివేతలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలను, బాలికలను చైతన్యవంతులను చేయడమే ఈ మహాసభల లక్ష్యమని తెలిపారు. అభ్యుదయవాదులు, మేధావులు ఈ పోరాటాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి. ప్రమీల, పి. సరోజ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె. అశోక్, పి. కనకయ్య, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఓటరు ప్రతిజ్ఞ

**ఉదయం 11 గంటలకు అన్ని కార్యాలయాల్లో కార్యక్రమం**

**ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్**

**25న ఐడీవోసీలో ప్రధాన వేడుకలు**

**జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**



జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు జిల్లా వ్యాప్తంగా ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ఉదయం 11 గంటలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో అందరూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. ప్రతిజ్ఞ చేస్తున్న ఫొటోలు, వీడియోలను ఆయా శాఖల సోషల్ మీడియా ఖాతాల్లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 25న జరగనున్న 16వ జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. 'నా భారత్ - నా ఓటు' అనే నినాదంతో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యపరుస్తామని తెలిపారు. జనవరి 25న ఉదయం 11 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో (ఐడీవోసీ) ప్రధాన వేడుకలు జరుగుతాయని తెలిపారు. నూతనంగా నమోదైన వారికి గుర్తింపు కార్డులు అందజేస్తామని, ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పిస్తామన్నారు. అధికారులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# చర్యాల్‌లో పంచాయతీ నిధుల దుర్వినియోగం

**తీర్మానం లేకుండానే ఇష్టారాజ్యంగా పనులు..కార్యదర్శి తీరుపై గ్రామస్తుల ఆగ్రహం**

**సంగారెడ్డి, జనవరి 22 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని చర్యాల్ గ్రామంలో పంచాయతీ నిధుల దుర్వినియోగం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపించారు. అభివృద్ధి పనుల పేరుతో నిధులు పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. కాలనీ పైభాగం నుంచి కాకుండా, కేవలం కింది భాగంలోనే పైపులు వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల పైభాగంలో ఉన్న ఇళ్లకు రక్షణ ఉండదని పేర్కొన్నారు. తాము గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం లేదని, పనులు సక్రమంగా చేయాలని మాత్రమే కోరుతున్నామన్నారు. గ్రామ పంచాయతీలో ఎలాంటి తీర్మానం లేకుండానే పంచాయతీ కార్యదర్శి ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీ పనులను పైభాగం నుంచి చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# సింగరేణి టెండర్లపై 'సిట్' విచారణ జరపాలి


- నైని కోల్ బ్లాక్ టెండర్లలో అవకతవకలు
- సీఎం బావమరిదికి కట్టబెట్టే యత్నం: బీఆర్ఎస్ నేతలు
- కిషన్ రెడ్డి సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

రాష్ట్రానికి ఆయువుపట్టైన సింగరేణి సంస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బంధువులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డి ఆరోపించారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోలా రమేష్ గౌడ్‌తో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. 137 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణిని అవుట్‌సోర్సింగ్ సంస్థలా మారుస్తున్నారని విమర్శించారు. నైని కోల్ బ్లాక్ టెండర్లను సీఎం బావమరిది సృజన్ రెడ్డికి ఇప్పించేందుకే ఈ తతంగం నడుస్తోందని ఆరోపించారు. ఈ టెండర్ల వ్యవహారంపై సిట్ (సిటీ) చేత విచారణ జరిపించాలని, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా, ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావుపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. సిట్ విచారణ జరిగితే కాంగ్రెస్ బాగోతం బయటపడుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట నిరుద్యోగులకు హరీశ్ రావు శుభవార్త




- 'హరీశ్ అన్న ఉద్యోగ యాప్' ఆవిష్కరణ
- ఇంటి నుంచే ఉచితంగా పోటీ పరీక్షలకు కోచింగ్
- నేడు సిద్దిపేటలో ప్రారంభం

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోచింగ్ కోసం హైదరాబాద్ వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేసే పని లేకుండా, ఇంటి నుంచే ఉచితంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా 'హరీశ్ అన్న ఉద్యోగ యాప్'ను రూపొందించారు. ఈ యాప్‌ను శుక్రవారం (నేడు) సిద్దిపేటలో అధికారికంగా ప్రారంభించనున్నారు. నమూనా పేపర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 57 రకాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఈ యాప్‌లో కంటెంట్ పొందుపరిచారు. ఇందులో 2 వేల గంటల వీడియో క్లాసులు, 400 నమూనా ప్రశ్నాపత్రాలు, 4 వేల స్టడీ మెటీరియల్, పిడిఎఫ్‌లు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా రోజువారీ టెస్టులు, సందేహాల నివృత్తి, ఉద్యోగ ప్రకటనలు, క్యాంపస్ రిక్రూట్మెంట్ సమాచారంతో పాటు తెలుగు, ఆంగ్ల భాషల్లో క్లాసులు వీక్షించే సదుపాయం కల్పించారు. మొదటి విడతలో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన వెయ్యి మందికి ఏడాది పాటు ఉచితంగా అవకాశం కల్పిస్తారు. హైదరాబాద్‌లో కోచింగ్, వసతి కోసం ఒక్కో అభ్యర్థికి అయ్యే రూ. 50 వేల నుంచి లక్ష వరకు ఖర్చును తగ్గించాలనే ఉద్దేశంతో హరీశ్ రావు తన సొంత ఖర్చులతో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జనం పవర్



# క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- నాసర్ పురాలో 'టీబీ ముక్త్ భారత్'
- 45 మందికి నిర్ధారణ పరీక్షలు
- పూర్తిగా నయమయ్యే వ్యాధే: జిల్లా వైద్య అధికారి డాక్టర్ ధనరాజ్



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నాసర్ పురా పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ధనరాజ్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధుమేహంతో బాధపడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న 45 మందికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన నివారణ చర్యలు, జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చడమే ప్రభుత్వంతో పాటు వైద్య శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగిలో క్షయ లక్షణాలు ఉన్నాయా లేదా గుర్తించాలని, లక్షణాలు ఉన్నవారికి వెంటనే తెమడ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే 'డాట్స్' పద్ధతి ద్వారా చికిత్స ప్రారంభించాలని వైద్య సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు కూడా నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని స్పష్టం చేశారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెమడ పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని ప్రజలను కోరారు. క్షయ ఛాంపియన్ల (వ్యాధి నుంచి కోలుకున్నవారు) అనుభవాలను ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో వినియోగించి ప్రజల్లో భయం తొలగించాలని, క్షయ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ, అభిమానంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్షయ వ్యాధి పూర్తిగా నయమయ్యే వ్యాధేనని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ నిర్మలారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ రాజు, డాక్టర్ మనోహర్, ఆరోగ్య సిబ్బంది మల్లయ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జన్నారం సర్పంచుల ఫోరమ్ ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా పేరం శ్రీనివాస్ ఎన్నిక
- కొలువుదీరిన నూతన కార్యవర్గం
- నిధుల సాధన కోసమే పోరాటం



**జితేందర్ - జనం పవర్ స్టేట్ ఇంచార్జ్**

జన్నారం మండల రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జన్నారం మండల సర్పంచుల ఫోరమ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సర్పంచుల అత్యవసర సమావేశంలో అందరూ ఏకతాటిపైకి వచ్చి, ఫోరమ్ అధ్యక్షుడిగా పేరం శ్రీనివాస్ పేరును ఖరారు చేశారు. విభేదాలకు తావులేకుండా, అభివృద్ధిని కాంక్షిస్తూ సర్పంచులందరూ ఏకాభిప్రాయానికి రావడం విశేషం. మండలంలోని పంచాయతీల గళాన్ని వినిపించేందుకు, సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన టీమ్‌ను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా పేరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వాసాల నరేష్, ఉపాధ్యక్షులుగా నూతి రామయ్య, జిల్లపెల్లి గోపాల్, సుతారి సుమలత, సంయుక్త కార్యదర్శిగా రామటేంకి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీల మనుగడకు నిధులే ప్రాణాధారమని, పంచాయతీల పెండింగ్ బిల్లులు, అభివృద్ధి నిధుల విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా మండలంలోని అన్ని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ టీమ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం జన్నారంలో కోలాహలం నెలకొంది. పేరం శ్రీనివాస్, నూతన కార్యవర్గ సభ్యులను స్థానిక నేతలు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొని, కొత్త కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. శ్రీనివాస్ నాయకత్వంలో మండలం మరింత పురోగతి సాధిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కన్నుల పండువగా సీతారామ కళ్యాణం



- అయోధ్య బాలరాముడి ప్రతిష్ట సందర్భంగా వేడుక
- సిద్దిపేటలో ఘనంగా నిర్వహణ
- హాజరైన మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట జరిగి మూడవ సంవత్సరం నడుస్తున్న సందర్భంగా గురువారం సిద్దిపేటలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక శివం కాంప్లెక్స్, సుభాష్ రోడ్ ప్రాంతంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదేశాల మేరకు 39వ వార్డు కౌన్సిలర్ బోనగిరి దీప్తి నాగరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాముడి ఆదర్శాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణీయమని పేర్కొన్నారు. పట్టణం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గరిపల్లి లక్ష్మీనాదం, గోపిశెట్టి శరభయ్య, అంబడిపల్లి మల్లికార్జున్, ఇల్లందు రవీందర్ తదితరులు పాల్గొని సేవలందించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య కళ్యాణ మహోత్సవం ఘనంగా ముగిసింది.

# మున్సిపల్ ఎన్నికల్లో ఎగిరేది బీజేపీ జెండా

- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బీబీ పాటిల్
- బిచ్కుంద చైర్మన్ పీఠం దక్కించుకోవాలి
- ఎన్నికల సన్నాహక సమావేశంలో నేతల పిలుపు



**జుక్కల్, జనవరి 22 (జనం పవర్):**

బిచ్కుంద మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు శెట్పల్లి విష్ణు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పార్టీ తరపున బిచ్కుంద మున్సిపాలిటీ ఇంచార్జిగా మాజీ ఎమ్మెల్యే ఎండాల లక్ష్మీనారాయణ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, కామారెడ్డి జిల్లా ఇంచార్జి విక్రం రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బిచ్కుంద మున్సిపాలిటీ కార్యాలయంపై కాషాయ జెండా ఎగురవేయాలని, కచ్చితంగా చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బూత్ స్థాయి నుంచి కార్యకర్తలందరూ కలిసిమెలిసి పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార, కిష్టారెడ్డి, జాదవ్ పండరి, మంచి సిద్ధం సెట్, ముత్యం పిరాజి, గాండ్ల భాస్కర్, సురేష్, ఆర్తి, గీతంజలి తదితరులు పాల్గొన్నారు.

# దంత వైద్య సేవలకు జాతీయ గుర్తింపు

**డాక్టర్ శ్రీనివాస్ నాయక్‌కు 'తెలుగు వెలుగు' పురస్కారం**

**సామాజిక సేవలకు దక్కిన గౌరవం - 25న వరంగల్‌లో ప్రదానోత్సవం**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**



సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు, శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. శ్రీనివాస్ నాయక్ (బిడిఎస్, ఎండీఎస్) ప్రతిష్ఠాత్మక 'తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారంఉ 2026'కు ఎంపికయ్యారు. దంత వైద్య రంగంలో ఆయన అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థుల్లో కల్పిస్తున్న ఆరోగ్య చైతన్యాన్ని గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25న (ఆదివారం) ఉదయం 10 గంటలకు హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ (బాలసముద్రం)లో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ ఆచార్య డాక్టర్ శ్రీనివాస్ నాయక్‌కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నతమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ జాతీయ పురస్కారం రావడం సిద్దిపేట జిల్లాకు గర్వకారణమని వైద్య వర్గాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# పదవి కోసం కాదు.. అభివృద్ధి కోసమే

**బిచ్కుంద 10వ వార్డు బరిలో జీరిగివార్ స్వాతి సంజు**

**మాజీ ఎంపీ బీబీ పాటిల్ మద్దతు: బీజేపీ జెండా ఎగరడం ఖాయం**

**జుక్కల్, జనవరి 22 (జనం పవర్):**



భారతీయ జనతా పార్టీ తరపున బిచ్కుంద మున్సిపాలిటీ 10వ వార్డు నుంచి జీరిగివార్ స్వాతి సంజు ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తాను పదవి కోసం కాకుండా, మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగానే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజల బాగోగుల గురించి ఆలోచించే యువ నాయకులను ఆశీర్వదించి గెలిపించాలని ఆమె కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిచ్కుందలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎంపీ బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ ఫలితాలు విడుదల



**జుక్కల్, జనవరి 22 (జనం పవర్):**

బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) విద్యార్థులకు సంబంధించిన ఒకటి, మూడు, ఐదవ సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలు, అలాగే రెండు, నాలుగవ సెమిస్టర్ బ్యాక్లాగ్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి (సీఓఈ) ప్రొఫెసర్ కే. సంపత్ కుమార్, అడిషనల్ కంట్రోలర్ (ఏసీఓఈ), అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతబాయి, డాక్టర్ సంపత్ చేతుల మీదుగా ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సీఓఈ డాక్టర్ జి. వెంకటేశం, ఏసీఓఈ వై. సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ కె. అశోక్ అభినందనలు తెలిపారు.

# చేర్యాల్ సర్పంచ్ రేఖ వెంకట్ రెడ్డికి ఘన సన్మానం



**సంగారెడ్డి, జనవరి 22 (జనం పవర్):**

కంది మండలంలోని చేర్యాల్ గ్రామ డీఆర్ డీఏ - ఐకేపీ మహిళా కార్యాలయంలో గ్రామైక్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ చేవెళ్ల రేఖ వెంకట్ రెడ్డికి ఘనంగా సన్మానం నిర్వహించారు. చేర్యాల్ గ్రామానికి మహిళల కోసం నూతన భవనం మంజూరు కావడం పట్ల గ్రామైక్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ పాలకవర్గం తరపున సర్పంచ్ రేఖ వెంకట్ రెడ్డి నూతన భవన కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన తీర్మాన పత్రాన్ని ఐకేపీ - డీఆర్ డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం) శివలక్ష్మికి అధికారికంగా అందజేశారు. మహిళా సాధికారత దిశగా ఈ నూతన భవనం కీలకంగా నిలవనుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీసీ శశికళ, సీఏ లావణ్య, గ్రామైక్య సంఘ అధ్యక్షురాలు మంజుల, కోశాధికారి వీరమణి, కార్యదర్శి మమతతో పాటు గ్రామంలోని ఐక్య మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# హస్నుల్ గ్రామంలో మురికి కాల్వల శుభ్రం

**సర్పంచ్ నయీమ్ పటేల్ చొరవ**



**జుక్కల్, జనవరి 22 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని హస్గుల్ గ్రామంలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్ నయీమ్ పటేల్, పాలకవర్గ సభ్యులు గురువారం గ్రామంలోని మురికి కాల్వలను శుభ్రం చేయించారు. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురికి నీరు నిలిచిపోవడంతో దోమల బెడద పెరిగిందని, దీనివల్ల గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని గుర్తించారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని పాలకవర్గ సభ్యులతో కలిసి పలు వార్డుల్లో పేరుకుపోయిన మట్టిని, చెత్తను పంచాయతీ కార్మికులతో తొలగించి శుభ్రం చేయించారు.

# రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

**కాపర్ కాయిల్, ఆయిల్ చోరీ.. మక్క పంటలు ఎండిపోయే ప్రమాదం**

**బిచ్కుంద మండలం హస్గుల్ గ్రామంలో ఘటన**



**జుక్కల్, జనవరి 22 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం హస్గుల్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బీభత్సం సృష్టించారు. వ్యవసాయ బావుల వద్ద ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ కాయిల్, బుష్ రాడ్, ఆయిల్ దొంగిలించినట్లు విద్యుత్ శాఖ ఏఈ పవన్ తెలిపారు. ఎస్ఐ రైతులు ఇచ్చిన సమాచారంతో బిచ్కుంద ఎస్ఐ జి. రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన సర్వే నంబర్ 29/ఉ లో అస్పత్వార్ శ్రీనివాస్, సర్వే నంబర్ 44/ఈ/బి లో శ్రీరామ్ పొలాల వద్ద ఈ చోరీ జరిగినట్లు గుర్తించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం మక్క పంటకు నీళ్లు పెట్టే సమయం కావడంతో, ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను బిగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్‌మెన్ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది, రైతులు ఖయ్యూం, పరమేష్ తదితరులు ఉన్నారు.

# దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన పరిశీలన



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా కొల్లూరులో జరుగుతున్న దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన–2026ను సిద్దిపేట జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విషయ నిపుణుల బృందం సందర్శించింది. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు బృందం అక్కడి ప్రాజెక్టులను పరిశీలించింది. సిద్దిపేట జిల్లా బేగంపేట పాఠశాల ఉపాధ్యాయుడు ప్రభాకర్, రాయపోల్ విద్యార్థిని స్వాతి రూపొందించిన ఎగ్జిబిట్లు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని కల్లేపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడ పొందిన విజ్ఞానాన్ని శిక్షణ తరగతుల ద్వారా జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. కాగా, జిల్లా నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించి అవగాహన పెంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సబ్జెక్టుల నిపుణులు పాల్గొన్నారు.

# బస్వాపూర్ లో ఉచిత మెగా వైద్య శిబిరం




**కోహెడ, డిసెంబర్ 22 (జనం పవర్):**

కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సిద్దిపేట లోహిత్ సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఏ. భాస్కరరావు బృందం ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగింది. శిబిరంలో సుమారు 300 మంది గ్రామస్తులకు గుండె (టు డీ ఎకో, ఈసీజీ), మోకాళ్ల నొప్పులు, జ్వరం, షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు కాంగ్రెస్ గళం

- కూలీలతో కలిసి మట్టి పనులు చేసిన నేతలు
- మద్నూర్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ పర్యటన
- కేంద్ర చట్టాలపై ధ్వజం



**జుక్కల్, జనవరి 22 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఉపాధి హామీ చట్ట పరిరక్షణ సభ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో, అందునా కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా సచిన్ సావంత్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీని స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్' (బీవీ రామ్ జీ) చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. గ్రామీణ కూలీల కడుపు కొట్టే విధానాలను కాంగ్రెస్ ఎప్పటికీ అంగీకరించదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త చట్టాలు గ్రామ పంచాయతీల స్వయంప్రతిపత్తిని హరించేలా ఉన్నాయని, ఇవి ప్రజాస్వామ్యానికి ముప్పు అని విమర్శించారు. సభలో ప్రసంగాలకే పరిమితం కాకుండా నేతలు ఉపాధి హామీ కూలీల మధ్యకు వెళ్లారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ స్వయంగా కూలీలతో కలిసి మట్టి పనుల్లో పాల్గొన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మాటలకే కాదు, చేతలకు కూడా పార్టీ అని నిరూపించుకున్నారు. ఈ దృశ్యం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. అంతకుముందు తొలిసారిగా జిల్లాకు వచ్చిన సచిన్ సావంత్ కు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

# 'జనం పవర్' కథనానికి స్పందన.. కదిలిన యంత్రాంగం



- బైపాస్ రోడ్డు విస్తరణ పనులు షురూ
- హెచ్ఎండీఏ అధికారులపై జగ్గారెడ్డి దంపతుల ఆగ్రహం
- ఐబీ ప్రహరీ కూల్చివేత.. చెట్ల తొలగింపు

**సంగారెడ్డి, జనవరి 22 (జనం పవర్):**

సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు నాలుగు నెలలుగా జాప్యం కావడంపై పత్రికల్లో వచ్చిన 'జనం పవర్' కథనాలకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పందించారు. జాప్యంపై హెచ్ఎండీఏ అధికారులపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే రోడ్ విస్తరణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం నుంచే సంబంధిత అధికారులు ఆగమేఘాల మీద స్పందించి పనులు మొదలుపెట్టారు. ఐబీ గెస్ట్ హౌస్ ప్రహరీ గోడను జేసీబీల సహాయంతో కూల్చివేసి, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తూ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఐబీ గెస్ట్ హౌస్ నుంచి సంగారెడ్డి మండల పరిషత్ కార్యాలయం వరకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వాహన రాకపోకలను నియంత్రించారు. బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం కావడంపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విస్తరణ పూర్తయితే ఐబీ గెస్ట్ హౌస్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్ తదితరులు పర్యవేక్షించారు.



జనం పవర్

17 Jan 2026 - Page 9

## బైపాస్ రోడ్డు పనులు ఎప్పుడు?

ప్రజల సహనం పరీక్షిస్తున్న అధికారుల నిర్లక్ష్యం

సంగారెడ్డి, (ప్రతినిధి):జనం పవర్.

సంగారెడ్డి పట్టణ అభివృద్ధికి కీలకమైన బైపాస్ రోడ్డు ప్రస్తుతం ప్రజలకు శాపంగా మారింది. సుమారు రూ.12 కోట్ల వ్యయంతో రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారిని సంగారెడ్డి పట్టణంతో కలిపే ప్రధాన మార్గంగా ఉన్న ఈ బైపాస్‌పై రోజూ భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో రహదారి గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతోంది. వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ముతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

"రోజూ పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లడం కూడా కష్టమైపోయింది. పాదచారులు నడవలేని పరిస్థితి ఉంది" అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం

# సర్పంచ్ స్వయంకృషి.. ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

- రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన
- పెద్ద మాసాన్‌పల్లిలో బైక్ ర్యాలీ.. హాజరైన సీపీ రష్మీ పెరమాల్

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా తోగుట మండలం పెద్ద మాసాన్‌పల్లిలో గ్రామ సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి తన సొంత ఖర్చులతో గ్రామస్తులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, యువత ప్రాణ రక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పోలీసు కమిషనర్ (సీపీ) రష్మీ పెరమాల్, ఏసీపీ నర్సింలు హాజరయ్యారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణ రక్షణకు అత్యవసరమని వారు సూచించారు. అనంతరం హెల్మెట్లు ధరించిన వారితో గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రవికాంత్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన సందర్శన

- విద్యార్థుల ప్రతిభ అద్భుతం: టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- వివిధ రాష్ట్రాల ఎగ్జిబిట్ల పరిశీలన

**సంగారెడ్డి, జనవరి 22 (జనం పవర్):**

కొల్లూరులో నిర్వహిస్తున్న దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనను తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎగ్జిబిట్లను పరిశీలించి, వాటి పనితీరు, ఉపయోగాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనలు చాలా అద్భుతంగా ఉన్నాయని, విద్యార్థుల ప్రతిభ ఆకట్టుకుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎం. మోహన్, లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బలవంత రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి. ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రవికుమార్, కల్హేర్ ఎంఈఓ బి. సురేష్, జిల్లా కార్యదర్శులు బి.ఎన్. రాజు, అరుణ్ కుమార్, తుల్జారాం, జగన్మోహన్, జగదీష్, కృష్ణ అరుణ్ పాల్గొన్నారు.



# చరిత్ర సృష్టించిన సింధు



## కెరీర్‌లో 500వ విజయం నమోదు

**ఈ ఘనత సాధించిన తొలి భారతీయ షట్లర్ - ఇండోనేషియా మాస్టర్స్ క్వార్టర్స్‌కు చేరిక**

**జకర్తా, జనవరి 22 :**
భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అరుదైన రికార్డు సృష్టించారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కెరీర్‌లో 500 విజయాలు సాధించి చరిత్ర లిఖించారు. ఇండోనేషియా మాస్టర్స్-2026లో భాగంగా డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ హోజ్‌మార్క్‌పై గెలిచి ఈ మైలురాయిని చేరుకున్నారు. ప్రపంచంలో మహిళల సింగిల్స్ విభాగంలో ఈ ఘనత సాధించిన ఆరో ప్లేయర్‌గా, భారత్ తరపున తొలి క్రీడాకారిణిగా సింధు నిలిచారు.

### వరుస సెట్లలో విజయం

తాజాగా జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో సింధు 21-19, 21-18 తేడాతో లైన్ హోజ్‌మార్క్‌పై వరుస సెట్లలో గెలుపొందారు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 43 నిమిషాల్లోనే ఆటను ముగించారు. హోజ్‌మార్క్‌పై సింధుకు ఇది ఐదో విజయం. ఇప్పటివరకు సింధు తన కెరీర్‌లో 732 మ్యాచ్‌లు ఆడగా, అందులో 500 మ్యాచ్‌ల్లో విజయం సాధించడం విశేషం.

### క్వార్టర్స్‌లో చైనా క్రీడాకారిణితో పోరు

ఈ విజయంతో సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. తదుపరి మ్యాచ్‌లో చైనా టాప్ సీడ్, వరల్డ్ నెంబర్ 4 చెన్ యూఫీతో తలపడనున్నారు. వీరిద్దరి మధ్య ఇప్పటివరకు జరిగిన 13 మ్యాచ్‌ల్లో చెన్ యూఫీ 7-6 ఆధిక్యంలో కొనసాగుతున్నారు. చివరిసారిగా 2019లో చెన్ యూఫీపై గెలిచిన సింధు, ఈసారి కూడా నెగ్గి రికార్డు సమం చేయాలని భావిస్తున్నారు.

## నేను పరుగు తీసేలోపే..



# అతడు హాఫ్ సెంచరీ కొట్టాడు

### అభిషేక్ శర్మపై సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం

- **నా కాలంలో ఆ బంతుల్లో ఒక పరుగు చేసేవాడిని.. ఇతను 50 కొట్టాడు**

**హైదరాబాద్, జనవరి 22 :**
భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ యువ సంచలనం అభిషేక్ శర్మపై ప్రశంసల జల్లు కురిపించారు. న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ ఇప్పుడు క్రీడా లోకంలో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం 35 బంతుల్లో 84 పరుగులు చేసి భారత విజయంలో కీలక పాత్ర పోషించిన ఈ యువ ఆటగాడి శైలిని గవాస్కర్ కొనియాడారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ బ్యాటింగ్ వేగాన్ని తన కాలం నాటి క్రికెట్‌తో పోలుస్తూ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### ఆశ్చర్యపరిచే బ్యాటింగ్ శైలి

మ్యాచ్ ముగిసిన తర్వాత ఒక క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన సునీల్ గవాస్కర్, అభిషేక్ శర్మ బ్యాటింగ్ పట్ల తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. "ప్రస్తుత తరం ఆటగాళ్ల బ్యాటింగ్ శైలిని చూస్తుంటే అద్భుతంగా అనిపిస్తోంది. అభిషేక్ శర్మ కేవలం 18 బంతుల్లోనే తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. నిజం చెప్పాలంటే, నా కాలంలో నేను ఒక పరుగు తీయడానికి ఎన్ని బంతులు తీసుకునేవాడినో, ఇప్పుడు ఈ కుర్రాడు అన్ని బంతుల్లో ఏకంగా యాభై పరుగులు పూర్తి చేస్తున్నాడు" అని గవాస్కర్ చమత్కరించారు. తన సుదీర్ఘ కెరీర్‌లో గవాస్కర్ రక్షణాత్మక ధోరణికి పేరుగాంచిన సంగతి తెలిసిందే. అందుకే ప్రస్తుత టీ20 ఫార్మాట్‌లో బ్యాటర్లు చూపిస్తున్న ఈ దూకుడును ఆయన వింతగా, అద్భుతంగా భావిస్తున్నారు.

### హిట్టింగ్ మాత్రమే కాదు.. టైమింగ్ కూడా

అభిషేక్ శర్మ కేవలం కళ్లు మూసుకుని బ్యాట్ ఊపడం లేదని, ప్రతి షాట్ వెనుక ఒక పద్ధతి ఉందని గవాస్కర్ విశ్లేషించారు. "చాలామంది యువ ఆటగాళ్లు కేవలం హిట్టింగ్ చేయడానికే ప్రయత్నిస్తారు. కానీ అభిషేక్ దగ్గర సరైన టైమింగ్ ఉంది. అతను మైదానం నలుమూలల షాట్లు ఆడగలడు. ముఖ్యంగా స్పిన్నర్లపై అతను విరుచుకుపడుతున్న తీరు భారత క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకం" అని పేర్కొన్నారు. కివీస్ బౌలర్లు ఎంత వేగంగా బంతులు వేసినా, ఎంతో ప్రశాంతంగా, భయం లేకుండా వాటిని సరిహద్దులు దాటించాడని, ఇలాంటి నిర్భయమైన క్రికెట్ ఇప్పుడు భారత జట్టుకు చాలా అవసరమని గవాస్కర్ అన్నారు.

## టీ20 వరల్డ్ కప్‌లో స్కాట్లాండ్‌కు ఛాన్స్?

**భారత్‌కు వచ్చేది లేదని తేల్చి చెప్పిన బంగ్లాదేశ్**
**నిర్ణయం మార్చుకోకపోతే వేటు తప్పదు: ఐసీసీ హెచ్చరిక**
**బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను తీసుకునే యోచన**
**24 గంటల డెడ్‌లైన్ విధించిన అంతర్జాతీయ మండలి**



**దుబాయ్/ఢాకా, జనవరి 22 :**
2026 టీ20 వరల్డ్ కప్ కోసం భారత్‌కు తమ జట్టును పంపేది లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మరోసారి స్పష్టం చేసింది. గురువారం ఢాకాలో క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్, సీనియర్ ఆటగాళ్లు, బోర్డు సభ్యుల మధ్య జరిగిన కీలక సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. భారత్‌లో భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నాయని, అందుకే తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ పట్టుబడుతోంది. ఈ నిర్ణయం పూర్తిగా తమ ప్రభుత్వానిదేనని ఆసిఫ్ నజ్రుల్ తెలిపారు.

బంగ్లాదేశ్ అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తిరస్కరించింది. భారత్‌లో ఆటగాళ్లకు ఎలాంటి ముప్పు లేదని స్వతంత్ర భద్రతా సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొంది. టోర్నీకి కొద్ది రోజుల ముందు షెడ్యూల్ మార్చడం అసాధ్యమని తేల్చి చెప్పింది. నిర్ణయం మార్చుకోవడానికి బంగ్లాదేశ్‌కు 24 గంటల సమయం ఇస్తున్నామని, ఒకవేళ రాకపోతే వారి స్థానంలో 'గ్రూప్-సి'లో స్కాట్లాండ్ జట్టును చేరుస్తామని హెచ్చరించింది. దీనిపై ఇప్పటికే బోర్డులో ఓటింగ్ కూడా జరిగినట్లు సమాచారం.

ఐసీసీ అల్టిమేటంపై బీసీబీ ప్రెసిడెంట్ అమీనుల్ ఇస్లాం ఘాటుగా స్పందించారు. ఒక అంతర్జాతీయ సంస్థ ఇలాంటి హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. తమ దేశంలో 20 కోట్ల మంది క్రికెట్ అభిమానులు ఉన్నారని, తాము లేకపోతే ఐసీసీకే భారీ నష్టమని వ్యాఖ్యానించారు. శ్రీలంకను 'కో-హోస్ట్' అని పిలవడాన్ని తప్పుబడుతూ, అది కేవలం 'హైబ్రిడ్ మోడల్' మాత్రమేనని అన్నారు. రాజకీయ ద్వేషంతో తీసుకుంటున్న ఈ నిర్ణయాలు బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వరల్డ్ కప్ నుంచి వైదొలిగితే భవిష్యత్తులో ఐసీసీ నిధులు ఆగిపోవడంతో పాటు, ఇతర దేశాలతో ద్వైపాక్షిక సిరీస్‌లపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా భారత్ వంటి బలమైన బోర్డుతో సంబంధాలు దెబ్బతింటే బంగ్లాదేశ్ క్రికెట్ ఆర్థికంగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఐసీసీ డెడ్‌లైన్ ముగిశాక ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### అక్షర్ పటేల్ కు గాయం...
## టీమిండియా ఆందోళన

**నాగ్‌పూర్, జనవరి 22:** న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టి20 మ్యాచ్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు డారిల్ మిచెల్ కొట్టిన షాట్‌ను ఆపే క్రమంలో బంతి అక్షర్ ఎడమ చేతి చూపుడు వేలికి బలంగా తాకింది. దీంతో రక్తం కారడంతో తన ఓవర్ పూర్తి చేయకుండానే మైదానం నుంచి వెళ్లిపోయారు. మిగిలిన మూడు బంతులను అభిషేక్ శర్మ వేశారు. 2026 టి20 ప్రపంచ కప్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన అక్షర్.. ఈ గాయం కారణంగా టోర్నీకి దూరమవుతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, గాయం తీవ్రతపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.



## జట్టు ఎంపిక కత్తి మీద సాము

### అందరినీ సంతృప్తి పరచలేం.. పక్కన పెడితే ఆటగాడికి కారణం చెప్పాల్సిందే: రోహిత్ శర్మ

**నాగ్‌పూర్, జనవరి 22:** జట్టును ఎంపిక చేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అని, ఈ విషయంలో అందరినీ సంతృప్తి పరచలేమని టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అన్నారు. వచ్చే నెలలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టి20 వరల్డ్ కప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఆయన.. జట్టు ఎంపిక, కెప్టెన్సీ సవాళ్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యం జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇది కెప్టెన్‌కు కత్తి మీద సాము లాంటిదని రోహిత్ పేర్కొన్నారు. అయితే ఒక ఆటగాడిని పక్కన పెట్టినప్పుడు, ఎందుకు ఎంపిక చేయలేదో కచ్చితంగా వివరించాలని అభిప్రాయపడ్డారు. "2022 ఆసియా కప్, వరల్డ్ కప్ సమయంలో శ్రేయస్ అయ్యర్‌ను కాదని, జట్టు సమతుల్యత కోసం దీపక్ హుడాను తీసుకున్నాం. ఈ విషయాన్ని నేను, కోచ్ రాహుల్ ద్రవిడ్ స్వయంగా అయ్యర్‌కు వివరించాం. అలాగే 2023 వన్డే వరల్డ్ కప్‌లో చాహల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో సిరాజ్ విషయంలోనూ ఇదే పద్ధతి పాటించాం" అని రోహిత్ గుర్తు చేసుకున్నారు.



జనం పవర్
శుక్రవారం
23 జనవరి 2026



## చిరు మూవీలో కృతిశెట్టి

'వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయబోతున్నారు. కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన రానుంది.

# ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లోకి దురంధర్

బాలీవుడ్‌లో ఎలాంటి భారీ అంచనాలు లేకుండా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసిన లేటెస్ట్ సెన్సేషన్ 'దురంధర్'. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్లింది. ఇండియన్ ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా రూ.1400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పాత్రలో నటించి మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకోగా, సారా అర్జున్ హీరోయిన్‌గా ఆకట్టుకుంది. అలాగే అక్షయ్ ఖన్నా చేసిన స్పెషల్ రోల్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. దురంధర్ మూవీ త్వరలోనే ఓటీటీలో విడుదల కానుంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం జనవరి 30 నుంచి దురంధర్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ వార్త బయటకు రావడంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులతో పాటు, ఇప్పటికే చూసినవాళ్లు కూడా మళ్లీ మళ్లీ చూడాలని ఆసక్తి చూపిస్తున్నారు. ఓటీటీలో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.థియేటర్ కలెక్షన్లతోనే కాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ కొత్త రికార్డ్స్ క్రియేట్ చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఈ సినిమాకు సీక్వెల్ కూడా రాబోతున్న విషయం తెలిసిందే. దురంధర్ సీక్వెల్‌ను మార్చి 19న విడుదల చేయనున్నట్టుగా మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.



## విశాల్ మొగుడు ప్రోమో

తమిళ నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 36వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాకు హిట్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహించబోతుండగా.. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న నాలుగవ చిత్రమిది. ఈ సినిమాకు తెలుగులో 'మొగుడు' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రోమోను విడుదల విడుదల చేసింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'మగ మహారాజు', 'మదగజరాజా', 'యాక్షన్' సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రూపొందుతోంది. ఈ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన ప్రోమో ఫుల్ ఫన్నీగా మరియు మాస్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. ముఖ్యంగా 'మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం' అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ నవ్వులు పూయి-ుస్తోంది. ఇందులో తమన్నా భర్తను శాసించే భార్యగా కనిపిస్తుంటే, విశాల్ ఇంట్లో పనులు చేసే అమాయకపు భర్తగా నటిస్తూనే.. భార్యకు తెలియకుండా బయట విలన్ల తాట తీసే మాస్ క్యారెక్టర్‌లో అదరగొట్టాడు.




# 26న డేవిడ్ రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల



మంచు మనోజ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చేసింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్, ఇప్పుడు తన తదుపరి ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద గట్టి దెబ్బ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డేవిడ్ రెడ్డి' కి సంబంధించి కీలక ప్రకటన చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ జనవరి 26న, అంటే రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో మెగా యాక్షన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఒక్కసారిగా జోష్ పెరిగింది.ఒక భీకరమైన శకం మొదలవుతోంది అంటూ మనోజ్ పెట్టిన క్యాప్షన్ సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో హింట్ ఇస్తోంది. ఈ చిత్రానికి హనుమ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, 'కె.జి.ఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. అంతేకాకుండా, ఎడిటర్ ఉజ్వల్ కులకర్ణి, ÷ట్ మాస్టర్ సుప్రీమ్ సుందర్ వంటి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పనిచేస్తుండటం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, హ్యాష్ ట్యాగ్‌లు చూస్తుంటే మనోజ్ ఈసారి మాస్ అండ్ వయోలెంట్ లుక్‌లో కనిపించబోతున్నట్లు అర్థమవుతోంది.



## హిందీలో సంక్రాంతికి వస్తున్నాంలో రాశీఖన్నా

దక్షిణాదితోపాటు అటు హిందీలోనూ అప్పుడప్పుడూ అవకాశాల్ని అందుకుంటున్న రాశీఖన్నాకి అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించే అవకాశం సొంతమైనట్టు సమాచారం. తెలుగులో విజయవంతమైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని హిందీలో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా రీమేక్ చేస్తున్నారు. ఇందులో భార్య పాత్రలో విద్యాబాలన్ నటిస్తుండగా, ప్రియురాలి పాత్రలో రాశీఖన్నా నటించనున్నట్టు సమాచారం. తెలుగులో మీనాక్షి చౌదరి చేసిన పాత్ర రాశి సొంతమైందన్నమాట. మొదట మీనాక్షి పేరునే పరిశీలించిన చిత్రబృందం, ఆ తర్వాత ఆ పాత్ర కోసం రాశిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

# బోర్డర్-2 విడుదలకు గల్ఫ్ దేశాలు నిరాకరణ?

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2' జనవరి 23న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర్'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్- పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర్' 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.




PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA,
PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862**, EDITOR: **BANDARI MARUTHI**